# గ్రంథాంత సందేశం

# సమస్త సంగతుల సంగ్రహం

*"కాలము సంపూర్ణమైనప్పుడు జరుగవలసిన యేర్పాటునుబట్టి, ఆయన తన దయా సంకల్పము చొప్పున తన చిత్తమును గూర్చిన మర్మమును మనకు తెలియజేసి, మనకు సంపూర్ణమైన జ్ఞాన వివేచన కలుగుటకు, ఆ కృపను మన యెడల విస్తరింపజేసెను. ఈ సంకల్పమును బట్టి ఆయన పరలోకములో ఉన్నవేగాని, భూమిమీద ఉన్నవేగాని, సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని తనలో తాను నిర్ణయించు కొనెను" (ఎఫెసీ. 1:9, 10).*

*"ఏలయనగా దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది; మరియు ఆయనయందు మీరును సంపూర్ణులైయున్నారు; ఆయన సమస్త ప్రధానులకును అధికారులకును శిరస్సైయున్నాడు" (కొలస్సీ. 2:9, 10).*

ఏదో ఒక సమయంలో ప్రతి సువార్తికుడు లేక బహిరంగ ఉపన్యాసకుడు "సభా పిరికితనాన్ని" సహజంగా ఎదుర్కొంటాడు. అతని చేతులు వణకుతాయి, గొంతు ఎండిపోతుంది, అతని కాళ్లు వణకుతాయి, సీతాకోక చిలుక తన కడుపుచుట్టు తపతపలాడుతున్నట్టుగా ఫీలౌతూ ఉంటాడు.

నేను ప్రసంగించుతున్న ఒక స్థలంలో ఉపన్యాస వేదికకు యిరు ప్రక్కల పిడులు ఉన్నాయి. సువార్తికుడు వాటిని పట్టుకొనడానికి అనువుగా అవి ఉంచబడ్డాయి. ఆ పిడులు ఏర్పాటు చేసిన ఉద్దేశాన్ని నేను ఎన్నడు వినలేదు, గాని భయపడే సువార్తికుడు వాటిని పట్టుకొని తన్ను తాను నిబ్బరపరచుకొనడానికి తగినట్టుగా ఉన్నాయి.

తాను ప్రసంగించ నారంభించినప్పుడు అతడు ఎంత భయం కలవాడయ్యాడంటే, అతని మోకాళ్లు కొట్టుకోలేదట, అవి లోపించినట్టుగానే తనకు తోచినట్టు ఒక సువార్తికుడు చెప్పాడు! తన మోకాళ్లు స్వాధీనంలో లేకుండ ఎంతగా ఊగిసలాడాయంటే, ఒక దానిని ఒకటి తాకకుండగనే వేగంగా వణకాయని అతడన్నాడు!

తనకు కలుగబోయే అనుభవంలో అనిశ్చయత కలిగియుండడమనేది సువార్తికుడే గాని, బహిరంగ సభలో మాట్లాడే వ్యక్తియేగాని అలా భయపడడానికి ప్రాథమిక

హేతువౌతుంది. అనుభవజ్ఞుడైన వక్తకైతే, సిద్ధపాటు ద్వారాను ప్రభువునందలి విశ్వాసం ద్వారాను – ఆత్మ సంబంధమైన నమ్మిక అనిశ్చయతను తొలిగిస్తుంది.

పిరికితనంగల బహిరంగ ఉపన్యాసకునివలె, ఎలా జీవించాలో తెలియని పరిస్థితిలో, జీవితాన్ని గూర్చి అనిశ్చయతగా వ్యాకులంగా మనం మారిపోతాం. కలతపరచిన చింత అనే రహస్యాన్ని మనం యితరులకు తెలియకుండ రహస్యంగా ఉంచుకొని ఉండవచ్చు. అది యితరులకు తెలిసినా, నీకు మట్టుకే తెలిసినా, అంతరంగంలో దేవుడు మనయందు ఉండాలని కోరిన నెమ్మదిని మననుండి దోచుకొని, అది మన జీవితాలను కుంటుబడజేయవచ్చు.

ఆశ్చర్యకరంగా, “నిశ్శబ్దమైన నిరాశ” అనే ఈ సమస్యకు పరిష్కారం ముఖ్యంగా, బహిరంగ సభలో మాట్లాడే భయాన్ని పోగొట్టుకునే లాటిదేనని బైబిలు అంటుంది. “లోతుగా అడుగు భాగమందు” పాపము, మరణము అనేవాటిని గూర్చిన భయం అనేవి స్థిరమైన అభయంతో నిండేవరకు తొలిగిపోదు. సత్యముపై పునాది వేయబడి జీవించే జీవితంనుండియే అది వస్తుంది.

ఎక్కడ ఉండాలని దేవుడు మనలను కోరుకున్నాడో అక్కడ మనమున్నామనియు, ఏమి చేయుమని దేవుడు మనలను కోరుకున్నాడో దాన్ని మనం చేస్తున్నామని ఎరగాలి. మన అంతరంగ పురుషునికి నెమ్మదిని ధైర్యాన్ని పుట్టించేది అదే. దేవుడే తప్ప లోకంలో మరి ఏదియు లేక ఎవడును పుట్టింపనేరడు.

వ్యక్తిగతమైన శాంతి అనే ఈ తలంపు కొలస్సీ. 2:10ఎ తో జత కూడుతుంది. అక్కడ “మరియు ఆయనయందు (క్రీస్తునందు) మీరును సంపూర్ణులైయున్నారు” అని పౌలు అన్నాడు. మరో విధంగా చెప్పాలంటే, దేవుని శాశ్వతమైన నిధుల యొక్క మొత్తాన్ని ఆయన క్రీస్తునందు ఉంచాడు. “పరలోకములో ఉన్నవేగాని, భూమిమీద ఉన్నవేగాని, సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని” ఆయన తనలో తాను నిర్ణయించుకున్నాడని పౌలు చెప్పడంలో ఆశ్చర్యం లేదు (ఎఫెసీ. 1:10బి), దైవికమైన దీవెనలన్నీ, కృపయొక్క ఆధిక్యతలన్నీ ఆత్మ సంబంధమైన ఆయన శరీరంలో నిర్ణయించ బడ్డాయి గనుక క్రీస్తు మనకు సమర్థుడై ఉన్నాడు.

ఇది సత్యం, ఎందుకంటే, “ఆయనయందు సర్వ సంపూర్ణత నివసింపవలెనని తండ్రి అభీష్టమాయెను” (కొలస్సీ. 1:19). ఇది సత్యం, ఎందుకంటె, “ఆయనయందు సర్వ సంపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది” అని పౌలు చెప్పగలిగాడు (కొలస్సీ. 2:9). “... సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది” (ఎఫెసీ. 1:22బి, 23).

క్రీస్తులో ఉండి దేవుని వాక్యపు వెలుగులో నడిచే ఎవడైనా, తన గత భయమునుండి విడిపించబడినవాడై, విశ్రమించవచ్చుననేది దీనియంతటిలోనున్న శుభవార్త. ఎందుకంటె అతడు దేవుని రక్షణలోను, జీవంలోను ఉన్నాడు. బలమైన ఈ సత్యము మన ఆలోచనలో వ్యాపించి, నేడు దేవుని యెదుట మనమేమైయున్నామో అనే మన దృష్టిని మారుస్తుంది; భవిష్యత్తులో ఆయనతో మన నడకను వేగంగా నిలుపుతోంది. అది మన అంతరంగపు

ఆలోచనలకును ఎక్కువగా పెంచుకొంటున్న మన ఏర్పాట్లకును రంగులు దిద్దవలసి ఉంటుంది.

సంఘమందు దేవుని సంపూర్ణత మనకున్నదనే సువార్త నిజాన్ని గూర్చి జాగ్రత్తగా ఆలోచించు. "క్రీస్తునందు సంపూర్ణులై యుండడం అంటే అర్థమేమి?" అనే ప్రశ్నను నాతో కూడ లేఖనాలను పరిశోధించు.

## క్షమించబడడంలో సంపూర్ణుడు

క్రీస్తునందు సంపూర్ణులమై ఉండడమంటే, దేవునినుండి సంపూర్ణ క్షమాపణ పొందామని అర్థం. క్రీస్తు యొక్క ఆత్మ సంబంధమైన శరీరమనే – కృప యొక్క ఒకే పరిధి క్రొత్త నిబంధనకు తెలుసు! తన కుమారునియందు మాత్రమే విమోచన అనుగ్రహించాలని దేవుడు తన రక్షణ సంకల్పాన్ని రూపించాడు (యోహాను 14:6). గనుక, నీవు క్రీస్తునందున్నట్టయితే, నీవు విమోచనా పరిధిలో ఉన్నావు (రోమా 8:1), నీవు క్రీస్తుకు వెలుపల ఉన్నట్టయితే, శిక్ష విధింపబడే పరిధిలో ఉన్నావు (ఎఫెసీ. 2:12), అపవాది రాజ్యములో ఉన్నావు (కొలస్సీ. 1:13).

ఆత్మ సంబంధమైన ఈ రెండింటిలో ఒక వ్యక్తి ఏదో ఒక స్థలంలోనే ఉంటాడు. అతడు క్రీస్తులోనైనా ఉండాలి, క్రీస్తుకు వెలుపలనైనా ఉండాలి. రక్షింపబడే స్థలములోనైనా ఉండాలి, లేదా దేవునినుండి దూరపరచబడిన స్థలంలోనైనా ఉండాలి. దేనిలోనూ ఉండకుండ ఉండలేము సరిగదా, ఆ రెండింటిలో ఏదో ఒకదానిలో లేకుండ ఉండలేం!

క్రీస్తు రక్షణ కలిగియుండాలంటే, క్రీస్తునందున్న ఆ వ్యక్తి వెలుగులో నడువవలసి యుంటుంది (1 యోహాను 1:7); లేకున్నట్టయితే, రక్షణ పొందవలసిన స్థలంలో (క్రీస్తులో) అతడు ఉంటాడు గాని, పొందినదాన్ని పోగొట్టుకున్న, సీమోనువలె రక్షణ కలిగి ఉండవలసింది లేకుండాపోతుంది (అపొ. 8:20, 21). విశ్వాసంవలన జీవించడంలో రెండు గుణ లక్షణాలు యిమిడియున్నాయి; మొదటిది, మనలను రక్షించడానికి ప్రభువైన యేసునందు నమ్మికయుంచడం (ఎఫెసీ. 2:8, 9), మరియు రెండవది, క్రీస్తుయొక్క చిత్తానికి యథార్థంగా విధేయత చూపాలని అనుకోడం యిందు చేర్చబడింది (హెబ్రీ. 5:8, 9).

విమోచింపబడిన వ్యక్తి అంధకార సంబంధమైన అధికారంలోనుండి విడుదల చేయబడి, తాను ప్రేమించిన "తన కుమారుని యొక్క రాజ్య నివాసిగా" చేయబడతాడు. ఆయనయందు విమోచనము, అనగా పాపక్షమాపణ మనకు కలుగుతోంది (కొలస్సీ. 1:13బి, 14). క్రైస్తవుడుగా మారిన అన్యజనులను గూర్చి పౌలు యిలా అన్నాడు, "అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులై యున్నారు" (ఎఫెసీ. 2:13). పేతురు ప్రకారం, క్రీస్తునందుండి క్రైస్తవ కృపలయందు పెంపారువారికి నిత్య రాజ్యములో పరిపూర్ణమైన ప్రవేశం లభిస్తుంది:

> అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు, మరి జాగ్రత్తపడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున

మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తు యొక్క నిత్య రాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును (2 పేతురు 1:10, 11).

తన ఉపమానములలో ఒక దానియందు ప్రభువైన యేసు ఈ సత్యాన్ని మరువలేని రీతిలో ఉదహరించాడు (మత్తయి 20:1–16). ఒక ద్రాక్ష తోట యజమాని ఉదయ కాలంలో పెందలకడనే పని చేయడానికి కూలీలను పెట్టుకున్నాడు. తరువాత 9:00, 12:00, 3:00, మరియు 5:00 గంటలకును కూలీలను పెట్టుకుంటునే వచ్చాడు. ఆ దినపు పని ముగిసిన తోడనే, ఆ పనివారిలో ప్రతివానికి ఒకే జీతం యిచ్చాడు! అది అన్యాయంగా ఉన్నట్టు తోస్తుంది, కదా? ప్రతి ఒక్కడు అన్ని గంటలు సమానంగా పని చేయకుంటే వ్యవసాయదారుడు ఒకే రకమైన జీతం వారికందరికి యివ్వడు. నేడు ఆయన క్షేత్రంలో మనం ఏమి చేస్తున్నాము అనేదాన్ని ప్రభువు యొక్క కథ ఉదహరించడం లేదు. లేదా క్షేత్ర భూమిలో మొదటి శతాబ్దపు లోకం ఏమి చేసిందా అని చెప్పడానికి కూడా ఉద్దేశింపబడలేదు, కాని కృపా రాజ్యంలో దేవుడు ఏమి చేస్తున్నాడు అనే సంగతిని అది సూచిస్తుంది.

"సిలువ యొక్క అడుగు భాగమున భూమి చదును చేయబడింది." క్రీస్తునందున్న ఎవడును మరి యొకనికంటె అధికంగా రక్షింపబడలేదు. నీవు క్రీస్తునందుండి, నిన్ను రక్షించడానికి క్రీస్తునందు విశ్వసించి, ఆయన చిత్తాన్ని జరిగించడానికి యథార్థంగా వెదకుతున్నట్టయితే, క్రీస్తులో ఉన్న ఎవడైనా ఎలా రక్షింపబడతాడో నీవును ఆలాగే రక్షింపబడతావు.

---

**క్రీస్తునందున్న మన స్థితికంటె మరి శ్రేష్ఠమైన స్థితిలో మనం ఉండలేం; క్రీస్తునందుండి పొందేవాటి కంటె ఎక్కువైన ఈవులు తండ్రి వద్దనుండి మనం పొందలేం; ఆత్మ సంబంధమైన ఎదుగుదల క్రీస్తునందు మనకున్న అవకాశంకంటె ఎక్కువైన అవకాశం మనం పొందలేం.**

---

దేవుని వద్దకు ప్రతివాడును అదే విధంగా రావాలి – అయోగ్యులకు అనుగ్రహింపబడు కృపా సువార్తద్వారా లెక్క ఒప్పచెప్పవలసిన ప్రజలందరు పాపులైయుండి, క్రీస్తు రక్తంవలన రక్షింపబడవలసినవారై ఉన్నారు. ఇతరులకు ఎక్కువ రక్షణ కావలసి వచ్చినప్పుడు తనకు తక్కువ రక్షణ కావలసి వచ్చిందంటూ ఎవడును అతిశయపడనవసరం లేదు. లేక యితరులు పూర్తిగా నశించిపోగా తాను మాత్రము పాక్షికంగా నశించిపోయినట్టు తలంచ పనిలేదు. ప్రతివానిది ఒకే స్థితి – క్రీస్తులో లేనివారందరు సంపూర్ణంగా నశించారు, క్రీస్తులో ఉన్నవారందరు సంపూర్ణంగా రక్షింపబడ్డారు. ఎవడును క్రీస్తులో యించుమించుగా ఉండడు లేదా యించుమించుగా ఆయనకు వెలుపల ఉండడు.

రక్షణను గూర్చిన ఈ సత్యాన్ని సాదృశ్యమనే అద్దంగుండా చూడు. కేవలం ఎనిమిది మంది మాత్రమే నోవహు యొక్క ఓడలోనికి ప్రవేశించారు. ఓడలోనికి ప్రవేశించిన తక్షణమే, ఆ ఎనిమిది మంది కుశల స్థితిలో ఉన్నారు. ఏ ఒక్కరును మిగిలిన ఏడుగురు కంటె ఎక్కువైన కాపుదలలో లేరు. ఇతరులకంటె నోవహు ఎక్కువ ఆత్మ సంబంధమైన పరిపక్వం కలిగినవాడై ఉండవచ్చు. అయితే ఓడలోని వారందరు హానికి దూరంగానున్న వారే. ఓడకు వెలుపల లోకమందున్న జన సమూహాలు నీటి సమాధిలో మునిగి నశించారు.

తన గత జీవితంలో బ్యాంకు దోపిడి చేసిన ఒకనితో కొన్ని సంవత్సరాల క్రిందట గ్రంథం చదువుతున్నాను. తన నేరాన్ని గురించి తీర్మానింపబడి, శేషజీవితాన్ని (తప్పులను తెలిసికొని చింతించి సన్మార్గము నవలంభింపజేసెడు) చెరసాలలో గడిపాడు. తన జీవితాంతంలో, క్యాన్సర్ వ్యాధిగ్రస్థుడై, కొద్ది దినాలే జీవించే పరిస్థితికి చేరుకున్నప్పుడు, నేను అతని దర్శించినప్పుడు, క్రైస్తవుడుగా ఎలా మారాలో చెప్పుమని అతడు నన్ను కోరాడు. ఆస్పత్రిలో అతని పరుపు మీద ప్రక్కనే కూర్చుండి, రక్షణ మార్గాన్ని వివరించే లేఖన భాగాలను అతనికి నేను చదివి వినిపించాను. దాదాపుగా అతనితో రెండు గంటలు చదివిన పిమ్మట, తాను క్రైస్తవుడవ్వడానికి బాప్తిస్మం పొందాలనే తన కోర్కెను కన్నీటితో తెలియజేశాడు. "నీవు బాగుపడితే, ఆయనను సేవించడానికి యిష్టపడతావా?" అని అడిగాను. మిగిలిన తన జీవిత కాలం క్రీస్తు కొరకు జీవించగోరతానని అతడన్నాడు. అది ఎంత కాలమైనా, తాను ఏ పరిస్థితిలో జీవించవలసి వచ్చినా అతడు ప్రభువును సేవించడానికి పూనుకున్నాడు, దగ్గరగా ఉన్న బాప్తిస్మపు కొలనుకు కొందరు క్రైస్తవులు అతడ్ని స్ట్రెచ్చర్‌లో తీసికొనిపోయి ఆ దినాన అతనికి బాప్తిస్మమిచ్చారు. అతని బాప్తిస్మం అనంతరం ఒక వారానికి, జీవితానికి అటువైపుకు దాటిపోయాడు.

అతని జీవితంలోని 99 శాతం అతడు అంధకార సంబంధమైన రాజ్యంలో జీవించినా, బాప్తిస్మము వద్ద – అతని ప్రతిచర్య యథార్థమైనదని, అతని విశ్వాసము నిష్కపటమైనదని తలంచుతూ – అతడు కృపా రాజ్యంలో ప్రవేశించాడని చెప్పక తప్పదు. తన జీవితపు అవకాశంలో నడి రాత్రికి కొద్ది క్షణాలు ముందుగా అతడు ప్రవేశించినా, జీవితపు పగటి పూట ప్రవేశించినవారు పొందే నిత్య జీవమనే వరాన్నే తానును పొందుతాడు. తనకున్న చివరి వారం దినాలు, క్రీస్తునందు సంపూర్ణుడుగా విమోచింపబడిన స్థితిలో అతడు నిలిచియున్నాడు. ఆటలోని ఒక కక్ష చివరి భాగంలో కలిసి ఆడి, జీవితమనే ఆటలో గెలుపొందాడు.

క్రీస్తు యొక్క ఆత్మ సంబంధమైన శరీరంలో ప్రవేశించే విధానాన్ని తెలియజేసే ఒక లేఖన భాగం గలతీ. 3:27: "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు." దేవునియందును క్రీస్తునందును విశ్వాసముంచి, తన పాపముల విషయమై మారుమనస్సు పొంది, ప్రభువైన యేసునందు తన విశ్వాసాన్ని ఒప్పుకొని, క్రీస్తులోనికి ఒకడు బాప్తిస్మం పొందినట్లయితే, దేవునినుండి కలుగు పాపక్షమాపణయందు వెంటనే అతడు సంపూర్ణుడై ఉంటాడు. పాపులందరు పొందే పాపక్షమాపణయందు తక్షణమే అతడు సంపూర్ణుడై ఉంటాడు. పాపక్షమాపణను, నిత్య జీవమును పొందే విమోచింపబడినవారి పరిధిలో అతడు ప్రవేశిస్తాడు.

## ఏర్పాట్లలో సంపూర్ణుడు

ఒక విధంగా, క్రీస్తునందు సంపూర్ణులం అంటే, ఆత్మ సంబంధమైన యత్నాలలో మనం సంపూర్ణులమైయున్నాం. నిత్య మహిమకై వాగ్దానం చేయబడిన స్థలానికి చేసే మన ప్రయాణానికి అవసరమైన సామాగ్రి మనకు లభిస్తుంది.

కొలస్సీ సంఘం తప్పు బోధచేత కొట్టుమిట్టాడుతుంది. (అది జ్ఞాన తత్వవాదంచేత కావచ్చు.) దేవుని రక్షణ సంకల్పంలో క్రీస్తు ప్రభువు యొక్క స్థానాన్ని సాధారణం చేసింది. అబద్ధ బోధను ఓడించి దాన్ని లయపరచడానికి గాను, క్రీస్తు యొక్క ప్రాధాన్యతను సంపూర్ణంగా పౌలు కొలస్సయులకు వివరించాడు. దేవత్వం యొక్క సర్వ పరిపూర్ణత శరీరంగా క్రీస్తునందు నివసించిందని అతడు తెలియజేశాడు (కొలస్సీ. 2:9). అంటే, తండ్రియైన దేవుడు, కుమారుడైన యేసు, పరిశుద్ధాత్మ అనేవారు సంపూర్ణంగా, ఉచితంగా, కడపటిగా క్రీస్తునందు మనకు అనుగ్రహింపబడతారు. దేవుడు ప్రసాదింప వాంఛించిన ఆత్మ సంబంధమైన ఐశ్వర్య భాగ్యముల నిచ్చేటందుకు క్రీస్తు మూలమైనవాడు. మనము ఆయనయందు సంపూర్ణులమైయున్నాం (కొలస్సీ. 2:10), అంటే, మనము ఏమియు కొదువలేనివారమై ఉన్నాం.

ఎఫెసీ పత్రిక ఆరంభంలో, తన స్తుతి ప్రశంసయందు, క్రీస్తునందు ప్రసాదించిన సమస్తానికి పౌలు దేవుని యిలా స్తుతించాడు: "మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన **క్రీస్తునందు** పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను" (ఎఫెసీ. 1:3; ఒత్తి పలకడం నాది). తన రెండవ పత్రిక యొక్క ఆరంభమందు పేతురు కూడా ఆలాటి ప్రకటననే చేశాడు: "తన మహిమనుబట్టియు, గుణాతిశయమునుబట్టియు, మనలను పిలిచినవాని గూర్చిన అనుభవ జ్ఞాన మూలముగా ఆయన దైవశక్తి జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున, దేవుని గూర్చినట్టియు మన ప్రభువైన యేసును గూర్చినట్టియునైన అనుభవ జ్ఞానమువలన మీకు కృపయు సమాధానమును విస్తరించును గాక" (2 పేతురు 1:2, 3). ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములు ఎక్కడున్నాయో పౌలు తెలిపాడు, వాటిని మనం ఎలా పొందాలో పేతురు వివరించాడు. క్రీస్తునందు ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములన్నీ ఉన్నాయని పౌలన్నాడు, క్రీస్తు యేసును గూర్చిన అనుభవ జ్ఞాన మూలముగా అవి లభిస్తాయని పేతురన్నాడు. ఏదియెలాగున్నా దేవుడు క్రీస్తునందు మనకు ప్రసాదించిన తన వరములు మనకు సంపూర్తిగా సరిపోతాయని యిద్దరు రచయితలు తెలిపారు.

జలాంతర్గాములు, "నీటి అడుగున చలించే ఓడలను" గూర్చి ఆలోచించు. సముద్రపు లోతులలోనుండి మానవ దళాలను క్షేమంగాను, హాయిగాను కొనిపోగలవు. "ఉపరితలం క్రింద జీవించే" ఆ సమూహానికి భోజనపు శాలలు, పడకలు, వినోద క్రీడలకు సంబంధించిన వసతులు, అన్ని రకాలైన ఉత్తర ప్రత్యుత్తర ఏర్పాట్లు, ఏ అవసరం కలిగినా దానిని ఎదుర్కొనడానికి నవ సాంకేతిక విజ్ఞాన పరిజ్ఞానం నీటి క్రింది భాగం

లోనే వారికి లభిస్తాయి.

సముద్ర గర్భంలో ఉన్న పెద్ద లోయలు, మహా పర్వతాలలో అపాయాలు లాంటివి పొంచియున్నా, ఆ అపాయాలవలన హాని పొందకుండ జలాంతర్గామి తిరుగుతూ ఉంటుంది – దానిలోని ప్రయాణికులకు భద్రతనిస్తూనే దానితోపాటు, వారి ప్రయాణం సాగుతూ ఉండగా సాధారణమైన జీవిత అనుభవాన్ని వారికి యిస్తుంది: మరణము, భయోత్పాతము, చీకటి అనేవాటి మధ్య రక్షణ, జీవితం, సంతోషం మొదలైనవి ఉన్నా ఆశ్చర్యకరమైన భిన్నత్వం అందులో గోచరిస్తుంది.

దానికంటె అత్యున్నతమైన కోణంలో, దాదాపు అదే భావస్థితిలో క్రీస్తునందలి జీవితాన్ని వర్ణించవచ్చు. ఆయనయందు నిత్య మరణంనుండి మనం విడిపింపబడిన వారమేగాక, పాపము యొక్క నిత్య పరిణామాలనుండియు మనం కాపాడబడతాం (రోమా 8:1), జీవము యొక్క నూతన గుణమును మనం సొంతముగా కలిగియున్నాం. పరలోకము యొక్క ఆత్మ సంబంధమైన సమృద్ధిచే అనుదినం మనం ఆవరించబడియున్నాం (యోహాను 10:10), రాబోవు మహిమకు ముందుగల జ్యోతిని మనం చవి చూస్తాం.

జలాంతర్గామికి వెలుపల ఉన్నవాడు సముద్రం కలిగించే ఆపదలవల్ల వెంటనే నశిస్తాడు ఆలాగే క్రీస్తునకు వెలుపలనున్నవానికి నిరీక్షణ ఉండదు (ఎఫెసీ. 2:12). రక్షణయను జలాంతర్గామి క్రీస్తు శరీరమందున్నది. ఆయనయందు మనం క్షేమము కలిగియుంటాం; ఆయనకు వెలుపల పాపమను సముద్రంచేత నలిగిపోతాం. క్రీస్తే మన కాపుదల, పోషణ, భద్రత మరియు జీవనాధారమునై ఉన్నాడు.

నీవు క్రీస్తునకు వెలుపల ఉంటే, "ఒకడు క్రీస్తులోనికి ఎలా ప్రవేశిస్తాడు?" అని నీవు తప్పక అడుగుతావు. క్రీస్తు శరీరంలోనికి మనం ఎలా మార్చబడతామో పౌలు యొక్క వర్ణనను శ్రద్ధగా ఆలకించు: "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మం పొందిన మనమందరమును ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" (రోమా 6:3). మన విశ్వాసము బాప్తిస్మమందు ఆయన మరణములోనికి ప్రవేశించి నప్పుడు, విధేయతతో కూడిన విశ్వాసంతో ఆయనయందు మనం అనుదినం నివసిస్తాం.

## సమర్థతలో సంపూర్ణుడు

క్రీస్తునందు సంపూర్ణులమై ఉన్నామంటే, దాగియుండు శక్తిలో సంపూర్ణులం, దేవుడు తన పిల్లలైనవారికి ప్రసాదించే సమస్తంలోనికి సంపూర్ణమైన ప్రవేశం మనకున్నది. ఆత్మోన్నతికి సమానమైన అవకాశాన్ని, క్రీస్తునకు సమానంగా ఎదగడానికి క్రీస్తునందు ఒక స్థావరం కలుగుతుంది.

క్రీస్తునకు వెలుపల, తన పాపాన్నిబట్టి ఒకడు దేవుని సహవాసంనుండి దూరం చేయబడినవాడై ఉన్నాడు. క్రీస్తునందు వేరుచేయబడడం ఉండదు, ఎందుకంటె మన గత పాపము తొలిగించబడింది, మన ప్రస్తుత పాపము ఆయన రక్తంచేత తుడిచివేయ బడుతుంది. అందువలన, "ఆయన ద్వారా," క్రీస్తునందున్న వాడెవడైనా, యూదుడేగాని, అన్యుడేగాని, "ఒక్క ఆత్మయందు తండ్రి సన్నిధికి చేరగలిగియున్నాము" (ఎఫెసీ. 2:18).

ప్రవేశము అనే ఈ స్వాతంత్ర్యం కేవలం తెరువబడిన ద్వారమే అయ్యుండక; ఆ ద్వారం మీద ఆహ్వానపు గురుతుతో తెరువబడినదైయుంది. "ఆయనయందలి విశ్వాసముచేత **ధైర్యమును నిర్భయమైన ప్రవేశమును** ఆయననుబట్టి మనకు కలిగియున్నది" అని మనం చదువుతాం (ఎఫెసీ. 3:12; ఒత్తి పలకడం నాది).

"వచ్చి మమ్ములను చూడండి!" అనేది ఊరికి వెళ్లుతున్నవారు వీడ్కోలు చెప్పే మాటగా నీవు విని ఉండచ్చు. "ఇంక సెలవు" అని చెప్పేదానికి సామాన్యంగా వినియోగించే పలుకులై ఉంటాయి. అయితే వెళ్లుతున్నవారు ఉంటున్నవారికి యిచ్చే ప్రత్యేకమైన ఆహ్వానం కాదది. అది అర్థవంతంగా ఉద్దేశించి పలికిన ప్రయోగం కాదు. అయితే మనకు యివ్వబడిన దేవుని వాక్యం గాఢమైన, లోతైన భావంలేని సాధారణమైన ఆహ్వానం కాదు. ఆయన మనలను తన కుమారుని సహవాసమునకు, దానినిబట్టి తన సహవాసానికి ఆహ్వానించడం మాత్రమే గాక, మాటలకందని గాఢమైన వాంఛతో ఆయన మన సహవాసాన్ని కోరుతున్నాడు. మరణముకంటె బలమైన ప్రేమతో ఆయన హృదయం మనలను చేరుకుంటుంది.

దేవుని కుమారులంగా పరలోకపు ఆత్మ సంబంధమగు నిధికి మనకు ఉచిత ప్రవేశమున్నందున, ప్రతి క్రైస్తవుడును యోహానుతో చేరి యిలా చెప్పవచ్చు: "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమననుగ్రహించెనో చూడుడి..." (1 యోహాను 3:1ఎ).

క్రీస్తునందు విమోచింపబడిన వ్యక్తి, ఎంత సన్నిహితంగా మసలాలనుకుంటాడో అంత సన్నిహితంగా అతడు దేవునితోను, క్రీస్తుతోను, పరిశుద్ధాత్మతోను నడిచే అవకాశం గలవాడై ఉంటాడు. అవకాశం లేని కారణాన గాని, లేక సంపూర్ణ ప్రవేశం లేని కారణాన గాని అతని సహవాసపు ఎదుగుదల ఎన్నడు ఆటంకపరచబడదు. దేవునికి సన్నిహితంగా రావడం విఫలమైతే ఆ తప్పు మనదే గాని దేవునిది కాదు. మనం క్రీస్తులో ఒకనాడే ఉన్నా లేక పది సంవత్సరాలే ఉన్నా, ఒక నిమిషమే ఉన్నా లేక ఒక నెలయే ఉన్నా, మనమందరం తండ్రి సన్నిధికి సమానంగా చేరగలిగే అవకాశ భాగ్యం సమానంగా యివ్వబడింది. "ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసు క్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు" (గలతీ. 3:28). మనం సత్యమందు, సహవాసమందు, దేవుని సమీపించుటయందు, రక్షణయందు ఏకమైయున్నాం; గనుక, మనం నిజంగా క్రీస్తునందు ఒకటే అయ్యున్నాం.

అవకాశ భాగ్యం సొంతం కావలసిన అవసరం లేదని మనం జ్ఞాపకం ఉంచుకోవాలి. ప్రవేశానికి హక్కు ఉన్నంత మాత్రాన ప్రవేశించినట్టు మాత్రం కాదు. తన స్నేహితులను కొందరిని చూడాలని అట్లాంటిక్ మహా సముద్రాన్ని దాటి వెళ్ళాలనుకున్న ఒక మనిషిని గూర్చి నేను చదివాను. ఓడ టిక్కెట్ కొనడానికి కావలసిన డబ్బు కూర్చుకొనడానికి ప్రయాసపడ్డాడు. పోయి రావడానికి అయ్యే ఖర్చుకొరకు గత సంవత్సరాలలో దాచుకున్నది సరిపోతుంది. టిక్కెట్ కొని దూర ప్రయాణానికి ఏర్పాట్లు చేసికొన్నాడు. తన టిక్కెట్టు ఖర్చులో భోజనం కూడా ఉందని తెలీక, తన సంచుల్లో కొన్ని ఆహార పదార్థాలు ఉంచుకొని వాటితో ప్రయాణంలో సరిపుచ్చుకుందామనుకున్నాడు "ఒకటి రెండు వారాలు ఎవరైనా

ఎలాగైనా నిభాయించుకోగలరు" అని అతడు తలంచాడు. అట్లాంటిక్ మధ్యకు వచ్చేసరికి, డైనింగ్ హాల్లో లభించే వేడి వేడి భోజనానికి కూడా టిక్కెట్‌లోనే డబ్బు చెల్లించబడినట్టు ఎవరో ఒకరు అతనికి చెప్పారు!

అతడు సరియైన అవగాహనలేక, తనకున్న అవకాశాలను ఉపయోగించుకోలేక పోయాడు. ఇతర ప్రయాణికుల్లాగానే అతనికి కూడా భోజన శాలలో హక్కు ఉంది. కాని తాను కొనుక్కున్నదాంట్లో ఉన్న ప్రయోజనాన్ని తీసుకోలేదు. తన సొత్తునతడు సొంతం చేసుకోలేకపోయాడు. తన సామర్థ్యమునతడు చేజిక్కించుకోలేదు.

ఒకప్పుడు ఇశ్రాయేలీయులు కనాను దేశాన్ని సమీపించినప్పుడు, "నేను ఇశ్రాయేలీయుల కిచ్చుచున్న దేశము" అని వారు దేవుని వాగ్దానం పొందారు (యెహోషువ 1:2). యొర్దాను నదిని దాటి దేవుడు వారికిచ్చిన దానిని సొంతం చేసికొనే సంతోషకరమైన దినం త్వరలోనే వచ్చింది. "నేను మీకు దేశం యిచ్చాను, అయితే మీరు దానిని స్వాధీనపరచుకోవాలి" అని దేవుడు వారికి తెలియజేశాడు (యెహోషువ 1:11).

క్రీస్తునందు దేవుడు మనకు అట్టి ఆజ్ఞనే యిచ్చాడు: "నా దీవెనలన్నిటికిని నేను మీకు ప్రవేశం అనుగ్రహించాను. బుద్ధి విజ్ఞానముల సర్వసంపదలు క్రీస్తునందు క్షిప్తమై ఉన్నాయి. నాతో సన్నిహిత సహవాసము, నా బలము ద్వారా విజయములు కూడా యివ్వబడతాయి. అయితే నీవు చేరువకు వెళ్లి వాటిని కైవశం చేసికోవాలి. నేను మీకు ఆ దేశమునిచ్చాను. అయితే మీరు దాన్ని స్వాధీనపరచుకోవాలి" అని ఆయన తెలియజేస్తున్నాడు.

క్రీస్తు యొక్క ఆత్మ సంబంధమైన శరీరములో ఉన్నవారు అతని సామర్థ్యములో సంపూర్ణులై ఉన్నారు. పౌలు, పేతురు, యోహాను అనేవారు ఎంత సన్నిహితంగా నడిచారో మనం కూడా అంత సన్నిహితంగా దేవునితో నడిచే అవకాశముంది. దేవునితో మన సహవాసానికి మధ్య నిలిచే అడ్డంకులు మనం పెట్టుకున్నవే: పాపము, సోమరితనం, స్వార్థం మరియు గర్వం అనేవి. మన చేతిలో మనకు బైబిలనే దేవుని సంపూర్ణ ప్రత్యక్షత ఉంది. ఆరంభంలో లేఖనాలకు లోబడి క్రీస్తులోనికి వచ్చిన తరువాత, ఆయన చిత్తమును గూర్చిన జ్ఞానంలో మిగిలిన మన జీవిత కాలమంతయు పెరుగుదాం. పరిశుద్ధాత్మ మనలో నివసిస్తాడు, మరియు మనకు ప్రార్థించే అవకాశ భాగ్యముంది (గలతీ. 4:6). దేవునితో మనకున్న ఆహ్వానాన్ని ఎన్నటికిని పోగొట్టుకోలేం; ఆయనకు మనం చేసే ప్రార్థనల విషయంలో, విరామం లేనివాడైయుండడు. అనుదినం తనతో నడవాలని ఆయన కోరుకున్నాడు. ఆ విలువను ఆయన సహవాస సంతోషాన్ని మనం గుర్తించాలని ఆయన శాంతంగా వేచియున్నాడు. దేవునికి అనుకూలమును ప్రీతికరమునగు అరాధన అనుదినం మనం ఆయనకు సమర్పించగలం. ఆయనను ఆనందింపజేయగల స్తుతి, పూజించు బలిని ఆయన సన్నిధిలో పరిమళ భరితంగా ఉండునట్లు అర్పించగలం. క్రీస్తు ద్వారా, దేవుని ఔదార్య భాగ్యములను చేరగల శక్తి మనకు ప్రసాదింపబడింది.

## ముగింపు

క్షమాపణ పొందడంలోను, ఏర్పాట్లలోను, సమర్థతలోను క్రీస్తునందు మనం సంపూర్ణులమై ఉన్నామని ఎరగడం చెప్పనశక్యమైన సంతోషాన్ని మనకు కలిగించాలి. క్రీస్తులో మనం నిలిచియున్న దానికంటె శ్రేష్ఠమైన స్థితిలో మనం ఉండలేం. క్రీస్తులో మనం పొందగలవాటికంటెను శ్రేష్ఠమైన ఏర్పాట్లను తండ్రినుండి పొందలేం. క్రీస్తులో ఉన్న అవకాశం కంటె మించిన ఆత్మ సంబంధంగా ఎదిగే అవకాశ భాగ్యాలను మనం కలిగియుండలేం. మనం శిఖరాగ్రానికి చేరుకున్నాం, అత్యున్నతమైన, అతి శ్రేష్ఠమైన దానికి *(summum bonum)* వచ్చాం. సమస్త సంగతుల సంగ్రహానికి వచ్చి నిలిచాం. ఈ కారణాన్నిబట్టి పౌలు యిలా వ్రాశాడు: "ఆయనయందు సర్వ సంపూర్ణత నివసింపవలెననియు, ఆయన సిలువ రక్తముచేత సంధి చేసి, ఆయన ద్వారా సమస్తమును, అవి భూలోకమందున్నవైనను పరలోకమందున్నవైనను, వాటినన్నిటిని ఆయన ద్వారా సమాధాన పరచుకొనవలెననియు తండ్రి అభీష్టమాయెను" (కొలస్సీ. 1:19, 20).

100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాన్ని సాధించి, ఆ పందెంలో ప్రపంచంలోకెల్లా నీవు సాటిలేనివాడవని నీకు తెలిస్తే ఎలా ఉంటుంది? అమెరికా దేశపు ప్రసిడెంట్‌వై అమెరికాలోని అత్యున్నతమైన స్థానంలో ఉన్నావని నీవు అనుకుంటే ఎలాగుంటుంది? ఈ లోకంలో నీవే అందరిని మించిన ధనవంతుడవని, నీ కంటె ఎవరికి అంత డబ్బు లేదని నీవు ఎరిగితే ఎలా ఉంటుంది? నీవు జీవితం యొక్క శిఖరాగ్రాన ఉంటావా? అది నీ జీవితాన్ని సంపూర్ణం చేస్తుందా? లేదు.

తమ జీవన స్థితులు ఎంత దీన దశలో ఉన్నా, మిగిలిన లోకానికి తెలియబడని స్థితిలో అతడు/లేక ఆమె, క్రీస్తులో ఉన్న ప్రతి ఒక్కరు దేవుని దృష్టికి అత్యున్నత ప్రముఖ స్థానంలో ఉంటారు. బంగారు పతకపు విజేత, ప్రసిడెంట్, అందరిని మించిన ధనికుడు అనేవారు క్రీస్తునందున్న వారికంటె తక్కువవారే. ఆయన ఆత్మ సంబంధమైన శరీరంలోని అవయవముగా, నీవు సమస్తం కలిగియుంటావు. క్రైస్తవ యుగంలో ప్రతివానికి లభ్యమయ్యేలా దేవుడు చేయజూచిన దానికంతటికి నీకు ప్రవేశముంది.

నీవు క్రీస్తునందున్నట్టయితే, నీ కంటె ఎక్కువ ఐశ్వర్యంగా సరఫరాలు జరగడంలేదు: "... సమస్తమును మీవి. పౌలైనను అపొల్లోయైనను, కేఫాయైనను, లోకమైనను, జీవమైనను, మరణమైనను, ప్రస్తుతమందున్నవియైనను రాబోవునవియైనను సమస్తమును మీవే. మీరు క్రీస్తువారు; క్రీస్తు దేవునివాడు" (1 కొరింథీ. 3:21బి-23). నీవు క్రీస్తులో లేకున్నట్టయితే, నీ కంటే దరిద్రుడెవడునూ లేడు: "... ఇశ్రాయేలీయులతో సహపౌరులు కాక, పరదేశులును, వాగ్దాన నిబంధనలు లేని పరజనులును, నిరీక్షణలేనివారును, లోకమందు దేవుడు లేనివారునై యుండి క్రీస్తుకు దూరస్థులైయుంటిరని జ్ఞాపకము చేసికొనుడి" (ఎఫెసీ. 2:12).

ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమును విందాం: **క్రీస్తు లేకుండ నీకు విలువైనదేదీలేదు; ఆయనతో, నిజమైన విలువగల ప్రతిదీ ఉంది!**